క్లుప్తంగా

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొందాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న డీటీ చంద్రబాబునాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్‌ఓలను డీటీ చంద్రబాబునాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల సమస్యలపై దృష్టి సారించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. రైతులు తమ సమస్యలపై కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేలా ఉండరాదని, గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. భూ సర్వేను పూర్తి చేయాలన్నారు.

పోలినాంచారమ్మ ఆలయంలో పొంగళ్లు



విశేషాలంకరణలో పోలినాంచారమ్మ

ఏర్పేడు: మండలంలోని కోబాక పోలి నాంచారమ్మ ఆలయంలో మంగళవారం ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. ఆలయ పూజారి అమ్మవారి విగ్రహానికి వివిధ రకాల అభిషేకాలతో పూజలు చేశారు. అంజిమేడు గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లుపెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది గ్రామస్తులు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది.

కొళాయిలు ఏర్పాటు చేయరూ!



కొళాయిలు లేని తాగునీటి పైపులు

నారాయణవనం: బడిపిల్లల అవసరాలకు, తాగడానికి కొళాయిలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని కసిమిట్ట ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు పనుల్లో తాగునీటి వసతి కల్పించారు. అయితే పర్యవేక్షణ కొరవడి కొళాయిలు చోరీకి గురయ్యాయి. దీంతో తాగునీటి ట్యాంకును నింపకపోవడంతో గత సంవత్సరమంతా విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పలేదు. ఈ విద్యా సంవత్సరంలో అయినా కొళాయిలను బిగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిన్నపాండూరు

పీహెచ్‌సీకి రక్షణ కరువు

- రాత్రిపూట బిక్కుబిక్కుమంటూ వైద్య సిబ్బంది విధి నిర్వహణ
- మందుబాబులు, ఆకతాయిల బెడద



చిన్న పాండూరులో ప్రహరీ గోడ లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాత్రివేళల్లో రక్షణ లేకుండా విధులు నిర్వహించడం కష్టమేనని వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. 24గంటలు స్థాయి కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గత ప్రభుత్వం రూ.2కోట్లతో నూతన భవనాన్ని నిర్మించింది. ఆ భవనాన్ని అధికారికంగా ప్రారంభించినప్పటికీ అనధికారికంగా అక్కడే వైద్యసేవలను కొనసాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం నూతన ఆస్పత్రి భవనం ప్రధాన రోడ్డుకు కొంత లోపలికి ఉండడం, దానికి తోడు భవనానికి ఇరువైపులా అడవిని తలపించేలా ఖాళీ స్థలం ఉంది. దీంతో రాత్రివేళ మందుబాబులు, ఇతర కార్యకలాపాలకు పాల్పడే ఆకతాయిలు ఆస్పత్రిలోనికి వెళ్లడం.. మద్యం మత్తులో వైద్య సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం పరిపాటిగా మారింది. దీంతో మహిళా వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో మహిళా స్టాఫ్ నర్సు, మహిళా అటెండర్ మాత్రమే విధులు నిర్వహిస్తారు. ఏ రాత్రి ఏమి జరుగుతుందోనన్న ఆందోళనలో రోజువారీ విధులకు హాజరవుతున్నట్టు వాపోయారు. రాత్రి వేళ సెక్యూరిటీ గార్డును నియమిస్తే తమకు కొంత వరకు రక్షణగా ఉంటుందని చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

గతంలో సెక్యూరిటీ నియామకం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెక్యూరిటీ సమస్య గురించి గతంలో ఆస్పత్రి వైద్యాధికారులు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డికి రాతపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే దీనిపై స్పందించిన ఆయన శ్రీసిటీ ద్వారా సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. రాత్రిపూట వారు రక్షణగా ఉండేవారు. దీంతో మహిళా వైద్య సిబ్బంది విధుల నిర్వహణకు ఇబ్బందులు పడేవారు కాదు. అయితే తామిచ్చిన హామీ మేరకు జూన్ 1 నుంచి సెక్యూరిటీ సిబ్బందిని శ్రీసిటీ యాజమాన్యం ఉపసంహరించుకుంది. దీంతో 15 నెలల పాటు వారు అందించిన సేవల స్థానంలో కొత్తగా మరెవరినీ నియమించలేదు. మరలా ఆస్పత్రికి సెక్యూరిటీ సమస్య పునరావృతమైంది. ఆస్పత్రికి సమీపంలో వందలాది పరిశ్రమలు ఉన్నాయి. వారందరూ చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచే వైద్య సేవలను పొందుతారు. కనీస సామాజిక దృక్పథంతో స్పందించి ఆస్పత్రి భద్రతకు అండగా నిలిచే విధంగా పరిశ్రమ యాజమాన్యాలు ముందుకు రావాలని స్థానికులు, వైద్యాధికారులు కోరుతున్నారు.

ఎస్టీకాలనీలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని మడిబాక ఎస్టీ కాలనీలో మంగళవారం సర్పంచ్ చెంగల్‌రాజు, పాపానాయుడుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మడిబాక, రాజులకండ్రిగ, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 45 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాపానాయుడుపేట పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎం లలిత, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఆశ కార్యకర్తలు లక్ష్మీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అనీమియా వ్యాధిపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గిరిజన కాలనీలో మంగళవారం సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు గిరిజనులకు సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, అనీమియా జీవిత కాల వ్యాధి అని, ఈ వ్యాధి మూలాన రక్త ప్రసరణ తగ్గుతుందని, దీంతో స్ట్రోక్, కంటి సమస్యలు, అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుందన్నారు.గిరిజనులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుండటంతో కాలనీలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 5,946 మంది గిరిజనులను గుర్తించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ పోస్టు భర్తీ అయ్యేనా?

- వరదయ్యపాళెంలో 3 నెలలుగా భర్తీకాని పోస్టు
- ముందుకు సాగని ఫైళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వరదయ్యపాళెం: మండల పరిషత్ కార్యాలయంలో 3 నెలలుగా ఎంపీడీఓ పోస్టు భర్తీ కాలేదు. దీంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత ఎన్నికల బదిలీలలో కడప జిల్లా నుంచి ఇద్దరు అధికారులను నియమించినప్పటికీ వారు బాధ్యతలు స్వీకరించకనే వెనక్కి వెళ్లారు. దీంతో సత్యవేడు ఎంపీడీఓకు ఎన్నికల ముందు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఆయన కూడా కార్యాలయానికి రావడం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలు తమ సమస్యలు ఎవరికి నివేదించాలో తెలియక వెనుదిరుగుతున్నారు. అలాగే, వివిధ ఫైళ్లు కూడా కదలడం లేదు. మరోవైపు సిబ్బంది దృష్టికి ప్రజలు సమస్యలు తీసుకువచ్చినా తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎంపీడీఓ పోస్టును భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముక్కంటి సేవలో తెలంగాణ మంత్రి



ఆలయ ధ్వజస్తంభం వద్ద తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించిన మరువాడ గానామృతం

తిరుపతి కల్చరల్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో మంగళవారం సాయంత్రం అమెరికాకు చెందిన మరువాడ భీమశంకర్ సంగీత గానామృతం శ్రోతలను మైమరిపించింది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సంగీతాన్ని అభ్యసించిన భీమశంకర్ అమెరికాలో ఉద్యోగం చేస్తూ సంగీత వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నారు. ఈయన సంగీతానికి సంబంధించి అనేక వ్యాసాలు, విశ్లేషణాత్మక సదస్సులు నిర్వహించారు. ఇటీవల ఆయన హంసధ్వని పేరిట ప్రత్యేక పుస్తకాన్ని కూడా రాశారు. గాత్ర కచేరీలో భాగంగా వివిధ కీర్తనలు ఆలపించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. వీరికి వయోలిన్‌పై టి.జగదీశ్వరరావు, మృదంగంపై ఎం.మధుసూదన్ వాయిద్య సహకారం అందించారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

నారాయణవనం: మండలంలో సింగిరికోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలను, హోమాలను నిర్వహించారు. నరసింహస్వామి జన్మ నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలవరులకు అభి షేకాలను నిర్వహించారు. వెండి కవచాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. పాల్గొన్న భక్తులకు వస్త్ర బహుమానంతో పాటు తీర్థ ప్రసాదాలను ట్రస్టీ సభ్యుడు గిరిబాబు, భాస్కర్‌బాబు అందజేశారు. అలాగే అన్నదాన సత్రంలో అన్నప్రసాదాలను అందజేశారు. గిరిబాబు మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్యాన్నదాన సత్రంలో వితరణ చేస్తున్నట్టు తెలిపారు.

సమయ పాలన గాలికి..!



టీచర్ రాకపోవడంతో పాఠశాలలో ఆడుకుంటున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహానగర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సమయపాలన పట్టించకోవటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు తరగతులను ప్రారంభించవలసి ఉన్నా 9.30 గంటలైనా ఉపాధ్యాయుడు హాజరుకాకపోవడంతో విద్యార్థులు ఆటలు ఆడుకుంటూ కనిపించారు. ఉపాధ్యాయుడు సక్రమంగా విధులకు హాజరుకావటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంఈఓ రవీంద్రనాథ్ వివరణ కోరగా.. ఉపాధ్యాయుడు సమయపాలన పాటించడం లేదని పరిశీలనలో తేలితే చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఆర్‌బీకేలలో ఎరువులు



ఆర్బీకేలో ఉన్న ఎరువులను చూపుతున్న ఏఓ రేవతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేస్తున్నామని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి కోరారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీ, ఎరువులను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు 21 రకాల సేవలు అందుతున్నాయని, అందులో ముఖ్యంగా వైఎస్ఆర్ రైతు భరోసా, నాణ్యమైన ఉత్పాదకాల సరఫరా, సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఈ–పంట, పంట నమోదు, పశువైద్య సేవలు, వాతావరణ సూచనలు ఇవ్వడం, మట్టి పరీక్షలు మొదలైనవి ఉన్నట్టు వివరించారు.

నాడు–నేడు పనుల పరిశీలన



నాడు నేడు పనులను పరిశీలిస్తున్న జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రా రెడ్డి, ఎంఈఓ

నాగలాపురం: మండలంలోని బీరకుప్పం, కొట్టకాడు, వేంబాక్కం పాఠశాలను మంగళవారం తిరుపతి జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఐఈ చంద్రశేఖర్ రెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో మనబడి నాడు–నేడు పనులను పరిశీలించారు. నెలాఖరు లోపు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు కావలసిన వాటిని సమకూర్చుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారని ప్రధానోపాధ్యాయులను అభినందించారు. అనంతరం నాగలాపురంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఐఈఆర్‌పీలతో మాట్లాడారు.

ప్రత్యేక ప్రతిభావంతులను సర్వేలలో గుర్తించాలని, నమోదు శాతం పెంచాలని భవిత కేంద్రాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని సూచించారు. వారికి కావలసిన ఉపకరణాలను ఇవ్వడంతోపాటు ఫిజియోథెరపీ చేయిస్తామని చెప్పారు. అలాగే ఎస్కార్ట్ అలవెన్సు మంజూరు చేస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎక్కువమంది విద్యార్థులను గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జనార్ధనరాజు, ఐఈఆర్‌పీ జయపాల్, వసంత తదితరులు పాల్గొన్నారు.

సంగీత సప్తాహం ఆధ్యాత్మికం



హరికథ గానం చేస్తున్న భాగవతారిణి

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియంలో మంగళవారం ప్రముఖ భాగవత కళాకారులు ప్రదర్శించిన హరికథా గానామృతం ఆద్యంతం ఆధ్యాత్మికతతో ప్రేక్షకుల హృదయాలను పులకింపజేసింది. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో చేపడుతున్న నిరంతరాయ సప్తగిరి సంగీత సప్తాహం మంగళవారంతో మూడో రోజుకు చేరుకుంది. సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ భాగవత హరికథా కళాకారులు రామాయణ, భారత ఇతిహాసాలలోని పలు ఘట్టాలను చక్కటి అభినయంతో గానం చేసి శ్రోతలను మైమరిపించారు. ఉదయం 9 గంటలకు హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాస విరచిత కీర్తనలు గోష్టి గానం చేశారు. అనంతరం హరికథా కళాకారులు మండూరి లక్ష్మీకుమారి శ్రీనివాస చరిత్ర, లక్ష్మీరాజ్యం బృందం జానకీ శపథం, యండమూరి శిఖామణి భక్త ప్రహ్లాద, తాడేపల్లె గూడెంకు చెందిన కావూరి శారద సీతాకల్యాణం వంటి అద్భుత ఘట్టాలను సందర్భానుచితంగా రాగయుక్తంగా హరికథా గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు. వీరితో పాటు గుంటూరుకు చెందిన ధూళిపాళ్ల శివరామకృష్ణ శర్మ, గుంటూరుకు చెందిన వెంకట సింహాచల శాస్త్రి, హైదరాబాద్‌కు చెందిన శ్రీరాం భట్టర్, తెనాలికి చెందిన గాలి శివ పార్వతి తదితర 20 మంది హరికథా కళాకారులు ఇతిహాస పురాణాలలోని వైవిధ్య భరితమైన ఘట్టాలను వినసొంపుగా గానం చేశారు. మూడో రోజు హరికథ గానం చేసిన కళాకారుల బృందాలను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గంగులప్ప శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా నాలుగో రోజైన బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రముఖ సంగీత విద్వాంసులతో దాస సాహిత్య స్వర ధార కార్యక్రమం నిర్వహించారు.

చల్లంగ చూడు గంగమ్మా..



వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) నెమలి పింఛంతో సర్వాంగ సుందర అలంకరణలో గంగమ్మతల్లి

- గంగమ్మకు భక్తుల మరుపొంగళ్లతో మొక్కులు
- ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దర్శనం



అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ... అంటూ భక్తజనం మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి ప్రణమిల్లి వేడుకున్నారు. తిరుపతి గంగ జాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్ల మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన నాలుగో మంగళవారం కావడంతో అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. పొంగళ్లు నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం నెమలి పింఛంతో సర్వాంగ సుందర అలంకరణలో గంగమ్మ తల్లిని కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర మొక్కుబడి వేషాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మరి కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయానికి విచ్చేసి భక్తులకు ఆలయ ఈఓ కె.మమత అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయించి ప్రసాదాలు వితరణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



వివిధ రకాల వేషధారణల్లో ఆలయానికి వచ్చిన కళాకారులు



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

వైభవంగా ‘అంకమ్మ కొలుపు’



గంగమ్మ ముగ్గు, అంకమ్మ ముగ్గు, పోతురాజు ముగ్గు, పేరడంలో ఊరేగుతున్న పోతురాజు

సత్యవేడు: మండలంలోని పేరడం గ్రామ పంచాయతీలో సోమ, మంగళ వారాలు ‘అంకమ్మ కొలుపు’ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామ నలు వీధుల మలుపుల్లో కాపు కట్టారు. అంకమ్మ ఆలయం వద్ద ఇదే రోజు రాత్రి గంగమ్మ ముగ్గు, అంకాలమ్మ ముగ్గు, పోతురాజులు ముగ్గు వేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాత్రి ప్రారంభమైన ఉత్సవంలో గ్రామానికి చెందిన నాగరాజు కటుంబీకులు పోతురాజు విగ్రహాన్ని తలపై మోస్తూ గ్రామ వీధుల్లో కలియదిరిగారు. మంగళవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ఉత్సవంలో వీధి వీధినా పోతురాజుకు నైవేద్యాలు, పూర్ణకుంభాలు మొదలైనవి సమర్పించి మొక్కులు చెల్లించారు. బుధవారం ఉదయం వరకూ సాగే ఈ కార్యక్రమం అనంతరం పోతురాజులు అంకమ్మ ఆలయం వద్ద కొలువు దీరుస్తారు.